క్లుప్తంగా

రక్తదానం


రక్తదానం చేస్తున్న ఆజాద్ ఫౌండేషన్ సభ్యులు

అమలాపురం టౌన్: స్వాతంత్ర్య సమరయోధుడు చంద్రశేఖర్ ఆజాద్ జయంతి సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంక్‌లో ఆజాద్ ఫౌండేషన్ సభ్యులు మంగళవారం రక్తదానం చేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు యల్లమిల్లి నాగ సుధా కొండ ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో ఫౌండేషన్ సభ్యులు ఆకెళ్ల వెంకట నారాయణమూర్తి, జక్కం జయకృష్ణ తదితరులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన యువకులను అభినందించారు.

మెరుగైన ఆరోగ్య సేవలందించాలి


విలసవిల్లిలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్ ఊర్మిళాదేవి

ఉప్పలగుప్తం: రోగులకు మెరుగైన ఆరోగ్య సేవలందించాలని సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి అన్నారు. మండలంలోని విలసవిల్లి గ్రామంలో వైద్యాధికారి కె.లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య శిబిరాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, బళ్ల నాగ సతీష్, పుత్సల ఏసు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం


చట్టాలపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

తాళ్లరేవు: బాలలు, మహిళలకు రక్షణ కల్పించే చట్టాలపై విద్యార్థినులకు అవగాహన అవసరమని తాళ్లరేవు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఈఓ ఎస్.లలితా నిర్మల అన్నారు. దాడులు, లైంగిక వేధింపుల నుంచి బాలలు, మహిళలు ఎలా రక్షణ పొందాలనే అంశంపై పటవల ఎస్ఎస్‌పీవీ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ ఎస్.లలితా నిర్మల మాట్లాడుతూ పనిచేసే చోట మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. బాల్య వివాహాల నిషేధ చట్టం గురించి వివరించారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం టి.కాశీ విశ్వనాథ్, ఏఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

కామన్ సర్వీసెస్ సెంటర్లలో రేషన్ కార్డుల సేవలు

యానాం: నియోజకవర్గ పరిధిలో ఉన్న కామన్ సర్వీసెస్(సీఎస్) సెంటర్ల ద్వారా రేషన్‌కార్డులకు సంబంధించి సేవలు పొందవచ్చని పుదుచ్చేరి డైరెక్టరేట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డైరెక్టర్ శివరాజ్ మీనా మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేషనల్ ఇ-గవర్నెన్స్ ప్లాన్ ద్వారా ప్రయోగాత్మకంగా ఈ ప్రణాళికను అమలుచేస్తున్నట్లు తెలిపారు. రేషన్‌కార్డుల్లో పేర్ల నమోదు, తొలగింపు, అడ్రస్ మార్పు తదితర సేవలకు డైరెక్టరేట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ నిర్ణయించిన ఫీజులు చెల్లించడం ద్వారా వినియోగించుకోవచ్చన్నారు. ఈ ఫీజులు యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరి రీజియన్లలో ఒకే విధంగా ఉంటాయని తెలిపారు.

రేషన్ షాపుల ద్వారా నిత్యావసరాలు

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా నాలుగు రీజియన్లలోనూ రేషన్‌షాపుల ద్వారా నిత్యావసరాల పంపిణీ త్వరలో ప్రారంభిస్తున్నట్లు సీఎం రంగసామి మంగళవారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత బియ్యం, పప్పులు, ఆయిల్ వంటి నిత్యావసరాలను సబ్సిడీ ధరలతో పంపిణీ చేస్తామన్నారు. ప్రస్తుతం ఉచిత బియ్యం పంపిణీకి సర్వే నిర్వహిస్తున్నామన్నారు. పప్పులు, నూనె సబ్సిడీ ధరలకు అందించేందుకు ఇప్పటికే ఎల్జీ రాధాకృష్ణన్ ఆమోదం తెలిపారన్నారు. అదే విధంగా ప్రభుత్వ పాఠశాలల చిన్నారులకు చిరుధాన్యాల ఆహారాన్ని అందించనున్నట్లు తెలిపారు.

సుబ్బాలమ్మకు సారె

అమలాపురం టౌన్: పట్టణ దేవత సుబ్బాలమ్మ తల్లికి పట్టణ సూర్య బలిజ సంఘం ఆధ్వర్యంలో సేవా మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. భక్తులు సుబ్బాలమ్మ గరగలను నెత్తిన పెట్టుకుని స్థానిక సూర్యబలిజ వీధి నుంచి సుబ్బాలమ్మ దేవస్థానానికి ఊరేగింపుగా వచ్చి అమ్మ వారికి సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఏటా ఆషాఢ మాసంలో సూర్యబలిజలు మొక్కులు తీర్చుకోవడం దాదాపు 70 ఏళ్లుగా ఆనవాయితీగా వస్తోందని పట్టణ సూర్యబలిజ సంఘం అధ్యక్షుడు భాస్కర్ల రామకృష్ణ తెలిపారు. సంఘ ప్రతినిధులు మద్దుల రవి నాగేశ్వరరావు, కాశీ సురేష్, యండమూరి శివ కేశవ, ధరణికోట శ్రీనివాస్, దాసరి రామకృష్ణ పందిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


బోడసకుర్రును ముంచెత్తిన వరద


కొమరగిరిలో నీట మునిగిన ఆక్వా చెరువులు


పల్లంకుర్రు బూలవారిమొండి వద్ద ఏటిగట్టును పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్


పల్లంకుర్రు రేవు ప్రాంతంలో నీట మునిగిన గుడిసెలు


కుండలేశ్వరం పుష్కర ఘాట్ వద్ద దిగబడిన ఏటిగట్టుపై గ్రావెల్ వేయిస్తున్న అధికారులు

ముంపులో లంక గ్రామాలు


బోడసకుర్రు పల్లిపాలెంలో మునిగిన మత్స్యకారుల ఇళ్లు


అయినాపురం అవుట్ ఫాల్ స్లూయిజ్ నుంచి డ్రైనులోకి పోటెత్తుతున్న వరద నీరు

- రోజురోజుకూ పెరుగుతున్న వరద ఉధృతి
- ఆందోళన చెందుతున్న ప్రజలు

ముమ్మిడివరం/అల్లవరం/ఐ.పోలవరం/కాట్రేనికోన: గోదావరి వరద లంక గ్రామాలను ముంచెత్తింది. వరద ఉధృతి మరింత పెరుగుతుండడంతో ప్రజలకు కంటి మీద కునుకు లేకుండాపోయింది. ఏ నిమిషంలో ఏం జరుగుతుందోనన్న ఆందోళన అందరిలో వ్యక్తమవుతుంది. గత వారం రోజులుగా భారీ వర్షాలు పడడంతో పాటు ఉగ్ర గోదావరి పోటెత్తడంతో లంక గ్రామాల ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని కాలం వెళ్లదీస్తున్నారు. ధవళేశ్వరం నుంచి భారీగా వరద నీటిని వదులుతుండడం, బుధవారం నాటికి వరద మరింత పెరిగే అవకాశముందని అధికారులు చెబుతుండడంతో లంక వాసుల గుండెల్లో గుబులు పుట్టిస్తోంది.


అన్నంపల్లి అక్విడెక్టు వద్ద పరవళ్లు తొక్కుతున్న వృద్ధ గౌతమి

ముంపు బారిన వాణిజ్య పంటలు


కుండలేశ్వరం వద్ద దిగబడిన ఏటిగట్టును పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

ముమ్మిడివరం మండలంలోని లంకాఫ్‌తానేల్లంక, గురజాపు లంక, కూనాలంక, సలాదివారిపాలెం, కమిని ఐ.పోలవరం మండలం పుగాపుకులంక, కరవాపులంక, ఎదుర్లంక గ్రామాల్లో సుమారు 300 ఎకరాల్లో వాణిజ్య పంటలైన అరటి, కొబ్బరి, కాయగూరల తోటలు ముంపు బారిన పడ్డాయి. దీంతో ఇప్పటికిప్పుడు పంటలను ఎలా కాపాడుకోవాలో అర్థం కాక అన్నదాతలు నానా హైరానా పడుతున్నారు. వరద నీరు పల్లపు ప్రాంతాలు, పచ్చిక బైళ్లను ముంచెత్తడంతో పశువులకు పశుగ్రాసం కొరత ఏర్పడింది. పొలాల్లో పచ్చిక బయళ్లు ముంపునకు గురవ్వడంతో పశువులు మేత లేక విలవిలలాడుతున్నాయి. గోదావరి తిప్పు మధ్య ఉండే పశువులను వరద పెరగడంతో సురక్షిత ప్రాంతాలకు తరలించారు. దీంతో కనీసం ఎండు గడ్డి సైతం దొరక్క రైతులు ఇబ్బంది పడుతున్నారు. ముంపు కారణంగా నాట్లు వేసిన వరి చేలు దెబ్బ తిన్నాయని రైతులు వాపోతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

కుండలేశ్వరం వద్ద వృద్ధ గౌతమి కుడి ఏటిగట్టు సుమారు 50 మీటర్ల మేర దిగబడి పోవడంతో ఆయా ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. బొబ్బర్లంక-పల్లంకుర్రు ప్రధాన పంట కాలువ వైపు ఏటి గట్టు బలహీన పడింది. వరద ఉధృతి మరింత పెరిగితే ఇక్కడ పెను ప్రమాదం ఏర్పడే పరిస్థితులు ఉత్పన్నమవుతాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కలెక్టర్ మహేష్ కుమార్ కుండలేశ్వరం పుష్కర ఘాటు వద్ద ఏటిగట్టు రిపేరు పనులను, పల్లంకుర్రు శివారు బూలవారి మొండి వద్ద రక్షణ గట్టు పనులను పరిశీలించారు. దీంతో అధికారులు దిగబడిన ఏటిగట్టును గ్రావెల్ వేసి మరమ్మతులు చేపట్టారు. కలెక్టర్ మహేష్‌కుమార్ మండలంలోని అన్నంపల్లి, అయినాపురంలో వరద ముంపు ప్రాంతాలలో పర్యటించి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ఇదీ పరిస్థితి

- ముమ్మిడివరం మండలంలోని లంకాఫ్‌తానేల్లంక, గురజాపులంక, కూనాలంక, సలాదివారిపాలెం, కమిని ఐ.పోలవరం మండలం పుగాపుకులంక, కరవాపులంక, ఎదుర్లంక గ్రామాలు వరద నీటిలో చిక్కుకున్నాయి. ముంపు ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలు ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నారు.
- మురమళ్ల రాఘవేంద్ర వారధి వద్ద మత్స్యకార కాలనీలోకి వరద నీరు చొచ్చుకొచ్చి అక్కడున్న ఎనిమిది ఇళ్లను ముంచెత్తింది. దీంతో అక్కడ నివసించేవారంతా కట్టుబట్టలతో ఏటిగట్టు మీదకు చేరారు. కొమరగిరి, పశువులంక, ఎదుర్లంక, కేశనకుర్రు, గుత్తెనదీవిల్లో రొయ్యల చెరువులు నీట మునిగాయి. అన్నంపల్లి ఆక్విడెక్టును తాకుతూ వరద నీరు ప్రవహిస్తోంది. గౌతమీ నది ఉధృతి వల్ల ఎదుర్లంక, గుత్తెనదీవి వంటి ప్రాంతాల్లో వరద పరవళ్లు తొక్కుతోంది.
- అల్లవరం మండలం బోడసకుర్రు జాతీయ రహదారి వద్ద వైనతేయ నది ఉధృతంగా ప్రవహిస్తుంది. మంగళవారం ఉదయానికి బోడసకుర్రు పల్లిపాలెంలోని మత్స్యకార కాలనీలోకి వరద నీరు పోటెత్తింది. దీంతో 40 మత్స్యకార గృహాల్లోకి వరద నీరు చేరింది. బోడసకుర్రు పల్లిపాలెంతో పాటు గోపాయిలంకలో వరద నీరు పోటెత్తుతుంది. వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో మండల స్థాయి అధికారులు వరద బాధితులను అప్రమత్తం చేస్తున్నారు. తహసీల్దార్ సునీల్‌కుమార్, ఎంపీడీఓ కృష్ణమోహన్ పడవలపై వెళ్లి వరద బాధితులను పరామర్శించి ఎంపీపీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి రావాలని సూచించారు. వరద బాధితులకు తాగునీరు, వైద్య సౌకర్యాలు, విద్యుత్ సరఫరాపై అధికారులతో చర్చించారు. వరద ప్రభావిత ప్రాంతంలో ఎలక్ట్రికల్ ఏఈ వెంకటేశ్వరరావు, డాక్టర్ స్పందన, ఎఫ్‌డీఓ అశ్విని, ఎంఈఓ ఏడుకొండలు, ఆర్ఐ దుర్గా శ్రీనివాస్, సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, కార్యదర్శి దుర్గా శ్రీనివాస్ వరద పరిస్థితిని సమీక్షిస్తూ వరద బాధితులను అప్రమత్తం చేస్తున్నారు.
- కాట్రేనికోన మండలంలో నడవపల్లి, పల్లంకుర్రు రేవు, బూలవారి మొండి, బలుసుతిప్ప గ్రామాలు ముంపునకు గురయ్యాయి. ముంపులో ఉన్న పల్లంకుర్రు, నడవపల్లి, బలుసుతిప్ప గ్రామాల ప్రజలను ఖాళీ చేయాలని అధికారులు ఆదేశించారు. కాట్రేనికోన నుంచి కుండలేశ్వరం వెళ్లే బీటీ రోడ్డుకు ఉన్న మురుగు కాలువ తూరలు శిథిలం కావడంతో వరద నీరు పంట చేలల్లోకి వచ్చేస్తుంది. దీంతో ఈ ప్రాంతాన్ని గ్రావెల్‌తో పూడ్చి వేశారు.

జేసీ నుపూర్ అజయ్ ఉత్తమ సేవలందించారు



జేసీ నుపూర్ అజయ్‌ను పుష్పగుచ్ఛంతో అభినందిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: జిల్లా మొట్టమొదటి మహిళా జేసీగా పనిచేసిన నుపూర్ అజయ్ విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించి అటు అధికారులు, ఇటు ప్రజల మన్ననలు పొందారని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ప్రశంసించారు. విజయవాడ భూపరిపాలన కమిషనర్ కార్యాలయంలో సంయుక్త కార్యదర్శిగా బదిలీపై వెళుతున్న జేసీ ఎస్.నుపూర్ అజయ్‌కు సోమవారం రాత్రి కలెక్టరేట్‌లో అభినందన సభ ఏర్పాటుచేసి సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఏడాది పాటు పనిచేసిన నుపూర్‌అజయ్ పౌర సరఫరాలు, ధాన్యం సేకరణ, భూపరిపాలన, వరద సహాయక చర్యలు, సాధారణ ఎన్నికల నిర్వహణ వంటి అంశాల్లో తనదైన ముద్ర వేశారన్నారు. అనంతరం జేసీ నుపూర్ అజయ్ మాట్లాడుతూ గోదావరి జిల్లాలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. తన విధి నిర్వహణలో ఇద్దరు కలెక్టర్లు తనకు ఎంతగానో సహకరించి ప్రోత్సహించారన్నారు. డీఆర్ఓ ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తక్కువ సమయంలో ఎక్కువ పనితీరును కనబరిచేవారని ప్రశంసించారు. కార్యక్రమంలో ఆర్డీవోలు ఎస్.సుధాసాగర్, జీవీవీ సత్యనారాయణ, జి.కేశవ వర్ధన్ రెడ్డి, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థినికి సాయం అందజేత


కలెక్టర్ మహేష్‌కుమార్‌ను పూలమొక్కతో అభినందిస్తున్న షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం నాయకులు

అమలాపురం రూరల్: ఐఐటీలో సీటు సాధించి ఫీజు కట్టడానికి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రావులపాలెం మండలం పొడగట్లపల్లి గ్రామానికి చెందిన బట్టు మంజులకు ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం కోనసీమ జిల్లా శాఖ సమకూర్చిన రూ.50 వేల నగదును కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని మంజులను కలెక్టర్ అభినందించారు. అనంతరం కలెక్టర్ మహేష్‌కుమార్‌ను సంఘ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తుల నకులరాజు, ప్రధాన కార్యదర్శి గోసంగి బంగార్రాజు, ఆర్థిక కార్యదర్శి సాధనాల సత్యనారాయణ, ఆర్గనైజర్ సెక్రటరీ గెద్దం ప్రదీప్, మంగం సుధాకర్, అదనపు కార్యదర్శి బయ్య మోహనరావు, భూపతి మనోహర్ రాజు, బీఎస్ఆర్ ప్రసాద్, దార శ్రీకాంత్, ముత్తాబత్తుల శ్రీనివాసరావు, విప్పర్తి కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

25 మోటార్ పడవలు సిద్ధం

అమలాపురం రూరల్: జిల్లాలో గోదావరి వరదల నేపథ్యంలో ముందస్తు సహాయక చర్యల్లో భాగంగా ముంపు బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు మత్స్య శాఖ ద్వారా 25 మోటార్ పడవలను సిద్ధం చేసినట్లు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా వరద సహాయక చర్యల్లో భాగంగా ఇప్పటికే జిల్లాకు జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ బృందాన్ని కలెక్టరేట్‌లో సిద్ధంగా ఉంచామన్నారు. కె.గంగవరం మండలం కోటలంక గ్రామంలో 200 గొర్రెలను సురక్షిత ప్రాంతాలకు తరలించామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ 1,220 సురక్షిత తాగునీటి ప్యాకెట్లు, 20 లీటర్ల కెపాసిటీ ఉన్న 1,026 సురక్షిత తాగునీరు క్యాన్లు బాధితులకు సరఫరా చేశామన్నారు.

వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

అమలాపురం టౌన్: కోనసీమ వరద ప్రభావిత ప్రాంతాల్లో అప్పుడే సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయని, తక్షణమే ప్రతీ గ్రామ సచివాలయ పరిధిలో ఒక్కో వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేసి బాధితులను ఆదుకోవాలని భారత రిపబ్లికన్ పార్టీ (ఆర్‌పీఐ) రాష్ట్ర అధ్యక్షుడు డీబీ లోక్ డిమాండ్ చేశారు. వరద ప్రభావిత ప్రాంతాలైన బోడసకుర్రు తదితర గ్రామాల్లో ఆర్‌పీఐ బృందం మంగళవారం పర్యటించి బాధితులు ఎదుర్కొంటున్న అసౌకర్యాలను గమనించింది. వరద ప్రాంతాల్లో ముఖ్యంగా రాత్రి సమయాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత వల్ల పాములు తదితర విష సర్పాలు ఇళ్లలోకి చేరుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బాధితులకు అన్ని చోట్లా పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి వారికి సకాలంలో భోజనం, తాగునీరు అందించాలని సూచించారు. వరద ప్రాంతాల్లో పర్యటన పూర్తయ్యాక ఆర్‌పీఐ బృందంతో స్థానిక అరిగెలపాలెంలో జరిగిన సమావేశంలో లోక్ మాట్లాడి ప్రభుత్వం తక్షణమే వరద బాధితులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. ఈ బృందంలో ఆర్‌పీఐ నాయకులు పండు రాజేష్, డి.అశోక చక్రవర్తి, కె.బాబ్జి, పొలమూరి రమేష్, డేవిడ్ ఉన్నారు.

నానిరాజుకు మహాత్మాగాంధీ ఫెలోషిప్

అమలాపురం టౌన్: నడకపై చైతన్యం, పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నందుకు గాను స్థానిక సాయి సంజీవిని వాకర్స్ యోగా ఆరోగ్య సేవా సంస్థ అధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజుకు అంతర్జాతీయ వాకర్స్ సంస్థ నుంచి మహాత్మాగాంధీ ఫెలోషిప్ లభించింది. వాకర్స్ అంతర్జాతీయ చీఫ్ కో ఆర్డినేటర్ తేతల సత్యనారాయణరెడ్డి స్థానిక భూపయ్య అగ్రహారంలోని రుద్రరాజు కాంప్లెక్స్‌లో నానిరాజుకు ఈ ఫెలోషిప్ జ్ఞాపికను మంగళవారం ఉదయం అందించారు. అనంతరం జరిగిన వాకర్స్ సదస్సులో సత్యనారాయణరెడ్డి 'నడక-ఆరోగ్యం' అనే అంశంపై ఉపన్యసించారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు కొప్పిశెట్టి నాగేశ్వరరావు, కోశాధికారి బీవీవీ సత్యనారాయణ, సహాయ కార్యదర్శి మాకే బాలార్జున సత్యనారాయణ, పసలపూడి సత్యనారాయణ, కడలి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్వల్పకాలిక పంటనిచ్చే వంగడాలు మేలు


గొల్లవిల్లిలో నీట మునిగిన వరి చేలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

ఉప్పలగుప్తం: గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఖరీఫ్ చేలు నీట మునిగిన రైతులు 120, 130 రోజుల్లో స్వల్పకాలికంగా పంట చేతికొచ్చే వంగడాలను ఎంపిక చేసుకోవాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా కేంద్రం రీసెర్చ్ డైరెక్టర్ పీవీ సత్యనారాయణ రైతులకు సూచించారు. మండలంలో గొల్లవిల్లి గ్రామంలో వర్షానికి నీట మునిగిన వరి చేలను జిల్లా వ్యవసాయాధికారి ఓ.బోసుబాబుతో కలసి మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి బోసుబాబు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 4,200 ఎకరాలు వరి నాట్లు వేసిన చేలు నీట మునిగాయని, 300 ఎకరాల నారుమడి నీట మునిగిందని వివరించారు. చేలు నీట మునిగినచోట్ల రైతులు మళ్లీ నారుమడులు వేసుకోవాలని సూచించారు. రాయితీపై విత్తనాలను అందిస్తున్నామన్నారు. రైతులు పంట స్వల్పకాలంలో దిగుబడి వచ్చేలా ఎంటీయూ 1153, 1156, 1293 రకాలను ఎంచుకోవాలని సూచించారు. డ్రెయిన్ నీరు దిగక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు అధికారులకు విన్నవించుకున్నారు. కార్యక్రమంలో ఏడీఆర్ టి.శ్రీనివాస్, ఏరువాక శాస్త్రజ్ఞుడు నందకిషోర్, ఏడీఏలు, ఎంఏ షంషి, రాజశేఖర్, ఏవో జి.కుమార్ బాబు, రైతులు చిక్కం పెద్దబ్బులు, అరిగెల నానాజీ, అడబాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అకడమిక్ క్యాలెండర్ ఏది?


సమావేశంలో మాట్లాడుతున్న సురేశ్‌కుమార్

అమలాపురం టౌన్: స్కూళ్లు తెరిచి నెల రోజులు కావస్తున్నా ఇంతవరకూ అకడమిక్ క్యాలెండర్ విడుదల చేయలేదని యూటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కె.సురేశ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. అమలాపురంలోని యూటీఎఫ్ హోమ్‌లో మంగళవారం ఆయన మాట్లాడారు. ఎన్నికల హామీల్లో భాగంగా జీవో 117 రద్దు చేస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పిందన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విద్యారంగ సమస్యలపై దశల వారీ కార్యక్రమాలను విజయవంతం చేయాలని సురేశ్ కోరారు. ఈనెల 30వ తేదీ వరకూ విద్యాశాఖ అధికారులకు విజ్ఞాపనలు, ఆగస్టు 5 నుంచి 15 వరకూ ఎమ్మెల్యేలకు విజ్ఞాపనలు, ఆగస్టు 20 నుంచి 30 వరకూ 3 వేల సంతకాలతో మంత్రులకు వినతులు, సెప్టెంబర్ 1 నుంచి 10వ తేదీ వరకూ ముఖ్యమంత్రికి పోస్టు కార్డుల ఉద్యమం చేపట్టాలని పిలుపునిచ్చారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.జ్యోతిబసు, జిల్లా అధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.టి.వి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా వాసవీ మాత


శాకంబరి అలంకరణలో కన్యకా పరమేశ్వరి

అమలాపురం టౌన్: ఆషాఢ మాసం సందర్భంగా మంగళవారం స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలోని అమ్మవారు శాంకబరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఉత్సవ కమిటీ, పట్టణ వైశ్య సంఘం సంయుక్త ఆధ్వర్యంలో అమ్మవారితో పాటు ఆలయ ముఖ మండపాన్ని వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. అమ్మవారి దర్శనానికి ఉదయం నుంచి రాత్రి వరకూ వేలాది మంది భక్తులు తరలివచ్చారు. మహిళలు అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్ నందిపాటి శ్రీనివాస్, వైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు నంబూరి మూర్తి, అధ్యక్షుడు యెండూరి వెంకట్రామయ్య, ముఖ్య సలహాదారు యెండూరి నాగేశ్వరరావు, వైశ్య సంఘ ప్రతినిధులు నంబూరి సత్యనారాయణమూర్తి, నూలు రమేష్, వరదా సూరిబాబు, అప్పన వీరన్న తదితరులు పాల్గొన్నారు.